క్లుప్తంగా...

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపి రచనలు ఎంతో సరళంగా ఉంటాయని పలువురు ప్రముఖులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కవి ఎన్.గోపి రచించిన కవితా సంపుటి క్రియ ఒక జీవన లయ పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు కె.రాంచంద్రమూర్తి మాట్లాడుతూ.. వివిధ అంశాలపై తనదైన శైలీలో కవితలను రాయడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఉత్తరప్రదేశ్ ఐపీఎస్ అధికారి సత్యనారాయణ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్ వి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

రమణీయం.. యువ నాట్యోత్సవం



గన్‌ఫౌండ్రీ: భారతదేశంలో అనేక నృత్య రూపకాలు ఉన్నప్పటికీ కూచిపూడి అత్యంత శ్రేష్టమైనదని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నృత్య దీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో యువ నాట్యోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూచిపూడి ఆంధ్రప్రదేశ్‌కు చెందినది కావడం ఎంతో గర్వకారణమన్నారు. పలువురు కళాకారులకు నాట్య వికాస్ అనే బిరుదులను ప్రదానం చేసి సత్కరించారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ భిక్షువు, నిర్వాహకులు లక్ష్మీశంకర్ పాల్గొన్నారు.

కలిసి కట్టుగా కృషి చేయాలి



గౌలిపురా: కలిసి కట్టుగా కృషి చేస్తే మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ప్రజల సంక్షేమం సులువవుతుందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివ కుమార్, ప్రధాన కార్యదర్శి చుక్క అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం గౌలిపురాలోని కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ భవనంలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన దాదాపు 300 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పురస్కారాలను అందజేశారు. గోవింద్ రాజ్, వినోద్‌కుమార్, దత్తు, పొన్న బాల్‌రాజ్, తోట అశోక్, భాస్కర్ రావు, జానకి రాం, రమేష్, పొన్న సునీత, పరమేశ్వరి, మమత, నాగరాజ్ పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లపై మంత్రి తలసాని సమీక్ష వాయిదా

చార్మినార్: పాతబస్తీలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వాహణ తదితర అంశాలపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సోమవారం సాలార్ జంగ్ మ్యూజియంలో జరుగనున్న సమావేశం వాయిదా పడినట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆలే భాస్కర్‌రాజ్, గాజుల రాహుల్ తెలిపారు. పాతబస్తీ మహంకాళి జాతర ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రతి ఏడాది నిర్వహించినట్లుగానే ఈసారి ఈనెల 26న నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు.

హిజ్రాల హత్య కేసులో ముగ్గురి అరెస్టు

విజయనగర్‌కాలనీ: ఐదురోజుల క్రితం ఇద్దరు ట్రాన్స్‌జెండర్ల హత్య కేసులో టప్పాచబుత్ర పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. సయ్యద్ ఇనాయత్(25), మహ్మద్ ఇనాయత్(25), సయ్యద్ ఖాలేద్(33) వీరు ముగ్గురు కార్పెంటర్ పనిచేస్తారు. వీరు ఈనెల 21న హిజ్రాలు అయిన సయ్యద్ యూసుఫ్ అలియాస్ డాలి, మహ్మద్ రియాజ్‌ఉద్దీన్ అలియాస్ సోఫియాను కత్తులతో పొడిచి, బండరాళ్లతో తలపై మోది హత్య చేశారు. దర్యాప్తు చేపట్టిన టప్పాచబుత్ర పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని ద్విచక్ర వాహనాలతో పాటు కత్తులను, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జూదం ఆడుతున్న ఆరుగురి అరెస్టు

జియాగూడ: జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసిన ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గిరికపల్లి ఎస్‌బీఏ గార్డెన్ వెనుక గల వడ్డెర బస్తీలో బాంజావాడి, మంగళ్‌హాట్, కార్వాన్, జియాగూడ ప్రాంతాలకు చెందిన శివకుమార్(27), శంకర్‌లాల్ (43), రామ్‌కోటి (38), లక్ష్మణ్(49), అరుణ్(33), రాకేష్(26) జూదం ఆడుతున్నట్లు సమాచారం లభించడంతో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ముజఫర్, కుల్సుంపురా పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అమ్మా బైలెల్లినాదో..

ఘనంగా కోటలో రెండో బోనం పూజ

'2వ పూజకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు'





వేలాదిగా తరలి వచ్చిన భక్తులు బోనాల్లో ట్రాన్స్‌జెండర్లు వారి సహాయకుల హల్‌చల్

గోల్కొండ: గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతర 2వ పూజ ఆదివారం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 2వ పూజకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు కోటలోకి అమ్మా బైలెల్లినాదో.. అంటూ భక్తిపాటలు పాడుతూ ప్రవేశించారు. ఉదయం 10 గంటల వరకే కోటకు దాదాపు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఇదిలా ఉండగా భారీ సంఖ్యలో భక్తులు రావడంతో ట్రాఫిక్ పోలీసులు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలన్నీ ఫుల్ అయ్యాయి. గత్యంతరం లేక భక్తులు లంగర్ హౌస్, రాందేవ్‌గూడ, దక్కన్ పార్కు తదితర ప్రాంతాల్లో తమ వాహనాలను పార్క్ చేసి కాలి నడకన కోటకు వచ్చారు. కోటలోని నగీనాబాగ్‌లో మహిళా భక్తులకు నైవేద్యం తయారు చేయడానికి స్థలమే దొరకకుండా పోయింది. ముందుగా భక్తులు నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించి అమ్మవార్ల దర్శనానికి కోటపైకి బయలుదేరారు. ఒకేసారి భారీ సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయంలో అమ్మవారి దర్శనానికి తొక్కిసలాట జరిగింది.

తెలంగాణ నిషాన్ బోనాలు: జీవన్ సింగ్

గోల్కొండ కోట బోనాలు తెలంగాణకే గర్వకారణమని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీవన్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో కలిసి కోట మెయిన్ గేటు వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. కోట బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.15 లక్షలు కేటాయించిందన్నారు. ఆయన పీస్ కమిటీ చైర్మన్ రాజు వస్తాద్‌తో కలిసి కోట మెయిన్ గేటు వద్ద భక్తులను లోపలికి పంపించారు.

ట్రాన్స్‌జెండర్ల హల్‌చల్..

2వ పూజకు నగర వివిధ ప్రాంతాల నుంచి గ్రూపులా ట్రాన్స్‌జెండర్లు తరలివచ్చారు. వీరి వెంట వచ్చిన యువకులు మెయిన్ గేటుతో పాటు నాగదేవత పుట్ట వద్ద హల్‌చల్ చేశారు. మరోవైపు నాగదేవత పుట్ట వద్ద 2 వర్గాల ట్రాన్స్‌జెండర్లు ఒకరినొకరు తిట్టుకుంటూ వాగ్వాదానికి దిగారు.

భక్తులకు హెల్త్ క్యాంపులు..

బోనాలకు వచ్చే భక్తుల కోసం తెలంగాణ వైద్య విధాన పరిషత్ వారు కోటలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. క్లాపింగ్ పోర్టికో, నాగదేవత పుట్ట, మెట్ల మార్గం వద్ద 3 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మందులు ఇచ్చి సూచనలు ఇవ్వడం జరిగిందని, హెల్త్ క్యాంప్ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.







అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మైత్రి కమిటీ సభ్యులతో జీవన్ సింగ్

బోనాలను వైభవంగా నిర్వహిస్తాం

లంగర్‌హౌస్: 30 ఏళ్ల నాటి లంగర్‌హౌస్ వాసుల కల నెరవేరిన వేళ ఈ సంవత్సరం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని బుజిలీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ ఆరెల్ల క్రిష్ణయాదవ్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని ప్రధాన అమ్మవారి ఆలయం అయిన బుజిలీ మహంకాళి ఆలయ కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించగా పార్టీలకు అతీతంగా ఆరెల్ల క్రిష్ణయాదవ్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్రిష్ణయాదవ్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా లంగర్‌హౌస్‌లో బొడ్రాయి స్థాపించాలనే కల ఈ సంవత్సరం నెరవేరిందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ సంవత్సరమే తన కుమారుడు జగదీష్‌యాదవ్‌కు గోల్కొండ జగదంబిక ఆలయ కమిటీ చైర్మన్ పదవి, తనకు బుజిలీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రిష్ణయాదవ్‌ను మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, బస్తీల పెద్దలు స్వామి, బోగి యాదయ్య, పరమేష్, ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాష్‌రెడ్డి సన్మానించారు.



ఆరెల్ల క్రిష్ణయాదవ్‌ను సన్మానిస్తున్న బస్తీల పెద్దలు, నాయకులు

కొనసాగుతున్న చండీ మహాయాగం



మహాయాగంలో శివ ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ శ్రీదివ్య

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ మహాయాగం వచ్చే నెల 14 వరకు కొనసాగనుంది. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం కడపకు చెందిన ప్రముఖ వ్యాపారి శివ ప్రశాంతి రెడ్డి, డాక్టర్ శ్రీదివ్య దంపతులతో పాటు కుమార్తె శివ ప్రసిద్ధ, నగరానికి చెందిన శ్రీనివాస్, కవిత దంపతులు మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభినందనలు

అబిడ్స్: విద్యార్థులు క్రీడాల్లో రాణించే విధంగా తమ పాఠశాల కృషి చేస్తుందని డైమండ్‌జూబ్లీ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత గాడే పేర్కొన్నారు. అబిడ్స్‌లోని డైమండ్‌జూబ్లీ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి మహ్మద్ షరీఫ్ న్యూఢిల్లీలో జరుగనున్న 31వ జాతీయ కరాటే డో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు మహ్మద్ షరీఫ్ ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత గాడే ఆయనను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... జాతీయస్థాయిలో కరాటే పోటీలకు తమ పాఠశాల విద్యార్థి అర్హత సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.



మహ్మద్ షరీఫ్‌ను అభినందించిన ప్రిన్సిపాల్ సుజాత గాడే

అవార్డు ప్రదానం



అవార్డును అందుకున్న విద్యార్థి పూనమ్

జియాగూడ: తెలంగాణ రాష్ట్ర డైనమిక్ ఫెడరేషన్ ఆఫ్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రతిఏటా 10వ తరగతి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు అవార్డులను అందజేసి ప్రోత్సహించడం హర్షణీయమని జియాగూడ కాకోజీ సైనిక్ స్కూల్ డైరెక్టర్ మహవీర్ ఓట్కార్, ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. ఈ మేరకు ఆదివారం కార్యాలయంలో ఎస్ఎస్సీ మెరిటోరియర్స్ అవార్డ్స్ 2022–23లలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు అవార్డులను బహూకరించారు. జియాగూడ కాకోజీ సైనిక్ స్కూల్ విద్యార్థిని 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన ఎల్.పూనమ్‌కు పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహెల్ ఖాద్రి అందజేశారు. అనంతరం మహవీర్ ఓట్కార్ మాట్లాడుతూ.. స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు.

గంగాబౌలిలో బోనాలు



అబిడ్స్: ధూల్‌పేట గంగాబౌలిలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. తొట్టెల ఊరేగింపు నిర్వహించి బోనాల సంబరాలు చేశారు. ఈ వేడుకల్లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని పూజలు చేశారు.

మంత్రి కేటీఆర్‌కు సన్మానం



అబిడ్స్: మంత్రి కేటీఆర్‌ను బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు కొమ్ముల నరేందర్ ఘనంగా సత్కరించారు. భద్రాచలం నుంచి పట్టు శాలువాను తెచ్చి మంత్రి కేటీఆర్‌కు సత్కారం చేశారు. ఈ సందర్భంగా కొమ్ముల నరేందర్ మాట్లాడుతూ.. దళితులకు కేవలం తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు.

జూలై 12న శోభన్‌బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

నాంపల్లి: బహుముఖ నటనా చక్రవర్తి, తెలుగు సినీ సొగ్గాడు శోభన్ బాబు అభిమానులకు దూరమై 15 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శోభన్ బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనాన్ని జూలై 12న బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికపై ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయని వాణీ గిరిజా సంగీత నాటక కళా సమితి అధ్యక్షుడు, శోభన్ బాబు జీవితకాలపు అభిమాని చల్లగాలి (ప్రతికంఠం) వెంకట్‌రాజు వెల్లడించారు. ఈ మేరకు నాంపల్లిలో ఆయన కార్యక్రమ వివరాలను మీడియాకు వివరించారు. శోభన్ బాబు మహోన్నతమైన వ్యక్తిత్వ ం గురించే కాకుండా ఆయన అభిమానుల నిస్వార్థ సేవా నిరతి గురించి తాను రాసిన స్థితప్రజ్ఞుడు అనే పుస్తకాన్ని రచించడం జరిగిందని, ఈ పుస్తకాన్ని జూలై 12న రవీంద్ర భారతిలో ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటుగా వివిధ కార్పొరేషన్లకు చెందిన పలువురు చైర్మన్లు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా కొనసాగింది. తెల్లవారు జామున 3 గంటలకు చాంద్రాయణగుట్ట శివార్లలో బలి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 5.35 గంటలకు భక్తిశ్రద్ధల నడుమ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగింది. అనంతరం ఇంటింటి నుంచి మహిళలు సంప్రదాయ వస్త్రాధారణతో బోనాలు సమర్పించారు. కుమ్మరి సంఘం అధ్యక్షుడు నరహరి, కార్యదర్శి శ్రీహరి, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.ప్రభుల పర్యవేక్షణలో ఆధ్వర్యంలో పోతరాజుల విన్యాసాల నడుమ 11 బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ధరంకార్ నాగరాజు, కరన్ కోట్ సాయి, గాజుల వెంకటరమణ, గౌని అజయ్ కుమార్ గౌడ్, సతీష్ గౌడ్, మణిక్యాచారి, మహేష్ గౌడ్, గణేష్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

నిలోఫర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్ ఇప్పించాలి

నాంపల్లి: ఇంక్రిమెంట్ విషయంలో నిలోఫర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కారు. రావాల్సిన బకాయిలను చెల్లించాలని ఆందోళన బాటపట్టారు. ఆదివారం ఏసీగార్డ్స్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు దోరపల్లి రమేష్ నేతృత్వంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధ్యక్షుడిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. జీఓ నెం.88కు అనుబంధంగా ప్రముఖ చిన్న పిల్లల ఆస్పత్రి నిలోఫర్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో 2018లో మల్టీపర్పస్ పద్ధతిలో నియమితులైన ఉద్యోగులకు 30 శాతం ఇంక్రిమెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. నిలోఫర్‌లోని రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్‌లో జీఓ నెం.88 కింద వివిధ విభాగాల్లో 74 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు వివరించారు. జీఓ నెం. 60 నుంచి 63 పీఆర్సీ ప్రకారం 2009 నుంచి నియమితులైన వారందరికీ 30శాతం ఇంక్రిమెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. స్పందించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బీఎస్పీ అలుపెరుగని పోరాటం చేస్తుందని, రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు.



ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేష్

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

అబిడ్స్: విద్యార్థులకు అండగా పూర్వ విద్యార్థులు, సంఘ సేవకులు నిలబడడం అభినందనీయమని కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయ హెచ్ఎం చల్లా శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సంఘ సేవకులు నందకిశోర్, మహేష్‌బాబు, పాఠశాల పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, శివకుమార్ ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందించడం సంతోషకరమన్నారు. పూర్వవిద్యార్థులు చంద్రశేఖర్, శివకుమార్ మాట్లాడుతూ.. తాము విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సునిత, జ్యోతి, ప్రియ, కవిత, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్, పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి

మృత్యుంజయ హోమం

జియాగూడ: జియాగూడ ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి, మహా మృత్యుంజయ హోమాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం ఇమాంపురాలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ, ఇమాంపురా నవభారత్ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద గణపతి పూజ, పాలాభిషేకం, మహా మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదిర సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇమాంపురా బస్తీలో ఇటీవల కొన్ని ఘటనలు జరిగినందువల్ల హోమాలు, ప్రత్యేక పూజలను నిర్వహించామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు జి.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వై.జస్వంత్ కుమార్, కోశాధికారి ఎం.మహేష్‌బాబు, సంఘం ప్రతినిధులు ఆర్.బాలకిషన్, డి.లక్ష్మీనారాయణ, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, డి.సంతోష్ కుమార్, జె.అర్జున్‌కుమార్, సి.సత్యనారాయణ, సి.శ్రీనివాస్, వై.యాదయ్య, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.



పాతబస్తీ బోనాలకు ఎంతో ప్రాధాన్యం

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గౌలిపురా కోట మైసమ్మ ఆలయంలోని అమ్మవారికి ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ఎస్.ఆనంద్‌రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో పాతబస్తీలో నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలు తెలంగాణలోనే వైభవంగా జరుగుతాయన్నారు.



పూజల్లో ఆనంద్‌రావు, శ్యాంరావు ముదిరాజ్

సెవన్ టూంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్

గోల్కొండ: చారిత్రక కట్టడాలను భావితరాలకు కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐకోమాస్ ఇండియా ప్రతినిధి నవీన్ పిప్లానీ అన్నారు. ఆదివారం ఐకోమాస్ ఇండియా ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని సెవన్ టూంబ్స్‌లో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల పరిరక్షణ కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. తాము వారసత్వ కట్టడాల ప్రమాణాలు, పద్ధతులను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామన్నారు. ఐకోమాస్ ఇండియా సౌత్ జోన్ కన్వీనర్ సూర్యనారాయణ, దాస్‌గుప్తా, వేద కుమార్, ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సీఈఓ రఫీష్ నంద తదితరులున్నారు.